సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025



కనకదుర్గమ్మకు వెండి వస్తువులు

అయినవిల్లి: దూనబోయినవారిపాలెంలో కనకదుర్గమ్మకు స్థానికులు కరుటూరి వీర వెంకట విశ్వేశ్వరరావు రూ.3 లక్షల విలువైన వెండి వస్తువులు సమర్పించారు.



ఇంటర్ పరీక్ష ఫీజుకు వేళాయె

వచ్చే విద్యా సంవత్సరంలో నిర్వహించనున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు సంబంధించి తొలి అడుగు పడింది. పరీక్ష ఫీజు చెల్లింపునకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది.

II లో

కడలిలోకి 4.36 లక్షల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 4,36,392 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి వదిలారు. తూర్పు డెల్టాకు 4,200, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.30 అడుగుల నీటిమట్టం నమోదైంది.

న్యూస్‌రీల్

పోలీస్ గ్రీవెన్స్‌కు 19 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ మీనా

అమలాపురం టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఎస్పీ రాహుల్ మీనా నిర్వహించిన ఈ పోలీస్ గ్రీవెన్స్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన అర్జీదారులు తమ సమస్యలపై 19 అర్జీలు అందించారు. వారి సమస్యలపై ఎస్పీ క్షుణ్ణంగా చర్చించి, వాటి పరిష్కార మార్గాలను ఆయా పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్సైలకు నిర్దేశించారు. ఫిర్యాదుల పరిష్కార నివేదికలను తన కార్యాలయానికి పంపించాలని సూచించారు.

పోలీస్ మౌలిక వసతుల విస్తరణకు చర్యలు

కోనసీమ జిల్లా ఏర్పడ్డాక జిల్లా పోలీస్ యంత్రాంగానికి కావాల్సిన మౌలిక సదుపాయాల విస్తరణపై ఎస్పీ రాహుల్ మీనా చర్యలు చేపడుతున్నారు. అమలాపురం ఆర్డీవో కార్యాలయం వెనుక ఉన్న పోలీస్ కార్టర్స్ ప్రాంతాన్ని, ఖాళీ స్థలాలను ఎస్పీ సోమవారం సాయంత్రం పరిశీలించారు. పంచాయతీరాజ్ డీఈఈ అన్యం రాంబాబుతో చర్చించారు. ఎస్పీ వెంట డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, డీసీఆర్‌బీ సీఐ వి.శ్రీనివాసరావు, పట్టణ సీఐ పి.వీరబాబు ఉన్నారు.

అన్న ప్రసాద భవనానికి రూ.1.25 లక్షల విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న సూపరింటెండెంట్ రాంబాబు

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం వకుళమాత అన్న ప్రసాద భవన నిర్మాణానికి భక్తులు విరివిగా విరాళాలు సమర్పిస్తున్నారు. రాజమహేంద్రవరానికి చెందిన కంకటాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, లక్ష్మీసుందరి దంపతులు, వారి కుటుంబ సభ్యులు అన్న ప్రసాద భవన నిర్మాణానికి రూ.1,00,007, రావులపాలెం మండలం కొమరాజులంకకు చెందిన సత్తి కుమారి దంపతులు రూ.25,116 విరాళంగా అందజేశారు. దేవస్థానం సూపరింటెండెంట్ పి.రాంబాబు దాతలకు స్వామివారి చిత్రపటాలను అందించారు.

బాలాత్రిపుర సుందరిగా విజయదుర్గా అమ్మవారు



రాయవరం: వెదురుపాక విజయ దుర్గా పీఠంలో శరన్నవరాత్ర ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8.19 గంటలకు పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) సమక్షంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ గాదె సత్య వెంకటకామేశ్వరి కలశస్థాపన ప్రతిష్ఠించారు. విజయదుర్గాదేవి ఉత్సవమూర్తి సహిత పంచాయతన దేవతలు, శ్రీదేవి, భూదేవి సమేత విజయవేంకటేశ్వరస్వామి విగ్రహాల మధ్య వేలాదిగా భక్తులు కలశాలను ఏర్పాటు చేసుకున్నారు. తొలిరోజు 1,050 మంది కలశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విశేష పూజలు, హోమాలు, దేవీయాగం నిర్వహించారు. విజయదుర్గా అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా పూలు, సర్వాభరణాలతో నయనానందకరంగా అలంకరించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వి.వేణుగోపాల్, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధుల ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.

అంగరంగ వైభవం.. శరన్నవరాత్ర సంరంభం

అమలాపురం టౌన్: జిల్లాలో శరన్నవరాత్ర మహోత్సవాలు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని కనకదుర్గ అమ్మవార్ల ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. అమలాపురం, రామచంద్రపురం, మండపేట పట్టణాలతో పాటు, మండల కేంద్రాలు, ప్రధాన గ్రామాల్లో ఉత్సవ చలువ పందిళ్లు వెలిశాయి. కనకదుర్గ అమ్మవార్లతో పాటు, కన్యకా పరమేశ్వరీదేవి ఆలయాలు, అమలాపురం శ్రీదేవి అమ్మవారి ఆలయాల వద్ద హోమాలు, కుంకుమ పూజలు జరిగాయి. కలశ స్థాపనలతో ఉత్సవాలకు ఆలయ కమిటీలు శ్రీకారం చుట్టాయి. తొలిరోజు సోమవారం పలు ఆలయాల్లో అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమలాపురం శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకృతులయ్యారు.

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో 12వ శక్తి పీఠం మాణిక్యాంబ అమ్మవారి సన్నిధిలో దసరా ఉత్సవాలను ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. వసంత మండపంలో ప్రత్యేకంగా సిద్ధం చేసిన అమ్మవారి మట్టి ప్రతిమను తొలిరోజు బాలాత్రిపుర సుందరి అవతారంలో అలంకరించారు. వేద పారాయణలు, సూర్య నమస్కారాలు, మహా లింగార్చనలు, అమ్మవారి అనుష్ఠానాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.



బాలాత్రిపుర సుందరిదేవిగా అమలాపురం శ్రీదేవి అమ్మవారు



అమలాపురం శ్రీదేవి అమ్మవారి ఆలయం చలువ పందిరి వద్ద భారీ సెట్టింగ్



ప్రత్యేకాలంకరణలో ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు



బాలాత్రిపుర సుందరీదేవి అవతారంలో మాణిక్యాంబ అమ్మవారి ప్రతిరూపం

ప్రజా సేవకుల పోరుబాట

- వేతనం మూరెడు.. వెట్టిచాకిరీ బారెడు
- కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఉద్యమ కార్యాచరణ
- నేటి నుంచి నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు
- డిమాండ్లు తీర్చకుంటే నిరవధిక సమ్మె
- గ్రామ సచివాలయ ఉద్యోగుల ఐక్య వేదిక తీర్మానం



అమలాపురంలో కలెక్టర్‌కు గోడు వెళ్లబోసుకుంటున్న సచివాలయ ఉద్యోగులు



రాజోలులో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న గ్రామ సచివాలయ ఉద్యోగులు

ఆలమూరు: గ్రామ స్వరాజ్య స్థాపన ధ్యేయంగా పనిచేస్తూ.. ప్రజల చెంతకే పౌర సేవలను అందిస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న కక్షపూరిత వైఖరిపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. గ్రామ సచివాలయాల ఉద్యోగులు శక్తికి మించి పనిచేస్తున్నా.. కూటమి ప్రభుత్వానికి కనికరం లేకుండా పోయింది. అరకొర జీతాలతో వెట్టిచాకిరీ చేస్తున్న ఉద్యోగులకు కూటమి నేతల వేధింపులు, ఈసడింపులు, పని ఒత్తిడి తట్టుకోలేక మానసికంగా కుంగిపోతున్నారు. ప్రజలకు అవసరం లేని సర్వేలను నిలిపివేయాలని, పని ఒత్తిడి తగ్గించాలన్న డిమాండ్లపై ప్రభుత్వం నుంచి స్పందన లేకపోగా బెదిరింపుల పర్వం ఎక్కువైంది. మండల స్థాయి జిల్లా స్థాయి వరకూ తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించి, తమ సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఉద్యోగులు ఉద్యమ బాట పట్టక తప్పలేదు. ఈ నేపథ్యంలో పాలకుల కళ్లు తెరిపించేలా ఉద్యమ కార్యాచరణకు ఉద్యోగులు ఉపక్రమించారు. తొలి దశలో ఈ నెల 23(మంగళవారం) నుంచి అక్టోబర్ ఐదు వరకూ నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అదే క్రమంలో ప్రభుత్వ ఉద్యోగులుగా తమ బాధ్యతలను ప్రజలు గుర్తుకు తెచ్చుకునేలా అక్టోబర్ ఒకటిన యథావిధిగా పింఛన్ల పంపిణీ చేపట్టేందుకు రాష్ట్ర స్థాయి గ్రామ సచివాలయ ఉద్యోగుల ఐక్య వేదిక తీర్మానించింది.

కొనసాగుతున్న వివక్ష

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా 515 గ్రామ సచివాలయాలున్నాయి. అందులో 467 గ్రామ, 48 వార్డు సచివాలయాలు ఉండగా, 3,982 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇప్పటికే గ్రామ వలంటీర్ల వ్యవస్థను రద్దు చేసి, ఆ బాధ్యతలను గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు అప్పగించి పనిభారాన్ని విపరీతంగా పెంచేసింది. ఇది చాలదన్నట్టుగా హేతుబద్ధీకరణ పేరిట గ్రామ సచివాలయాల్లో ఉద్యోగుల సంఖ్యను గణనీయంగా తగ్గించింది. దీనికితోడు వాట్సాప్ గవర్నెన్స్, పీ4 వంటి సర్వేలను చేయాలని ఉద్యోగులపై కూటమి ప్రభుత్వం ఒత్తిడి తెస్తోంది. ఏ ఇతర ప్రభుత్వ శాఖలకు లేని పనిభారాన్ని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు అప్పగించడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గౌరవంగా విధులు నిర్వహించి, ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ అనేక సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులకు అందించిన గ్రామ సచివాలయ వ్యవస్థపై ప్రభుత్వం కుట్రలు, కుయుక్తులు పన్నడం సరికాదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఉద్యోగుల డిమాండ్లివే..

- ఆరేళ్లు ఒకే క్యాడర్‌లో సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు స్పెషల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి.
- ప్రొబేషనరీ సమయంలో రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్లకు స్పష్టమైన ప్రైమ్ తేదీని ప్రకటించాలి.
- వార్డు సచివాలయాల్లో 50 శాతం ఖాళీలను గ్రామ సచివాలయ సిబ్బందితో భర్తీ చేయాలి.
- ప్రభుత్వ సర్వేలను ఆయా శాఖల ఉద్యోగులకు అప్పగించి, సచివాలయ సిబ్బందిపై భారం తగ్గించాలి.
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రస్తుతం అమలవుతున్న రికార్డు అసిస్టెంట్ క్యాడర్‌ను జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌కు మార్పు చేయాలి.
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల స్టేషన్ సీనియారిటీ ఆధారంగా పారదర్శక బదిలీలు జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.
- గ్రామ సచివాలయాల్లోని అన్ని విభాగాల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించేలా సీనియారిటీకి అనుగుణంగా జాబితాను రూపొందించాలి.
- విద్యార్హతల ప్రామాణికంగా సచివాలయ ఉద్యోగులకు విధులు అప్పగించాలి.
- ఇంటింటా నిర్వహించే సర్వేలు, ఇతర పార్టీ ప్రచార పనుల నుంచి తప్పించాలి.
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను వారి మాతృ శాఖలకు అప్పగించాలి.
- సమయపాలన లేని ఒత్తిడితో కూడిన విధుల నుంచి విముక్తి కలిగించాలి.



బడుగువానిలంకలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగి

నిరసన కార్యాచరణ

- జిల్లా ఐక్య వేదిక ప్రకటించిన నిరసన కార్యాచరణ ఇలా ఉంది.
- సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 5 వరకూ నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు.
- ప్రతిరోజు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ప్లకార్డులతో ప్రదర్శన.
- 27న గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాల అందజేత.
- 28న విశాఖపట్నం వేదికగా ఉద్యోగుల ఆత్మ గౌరవ ప్రాంతీయ సభ.
- జిల్లా కేంద్రాల్లో గ్రామ సచివాలయ ఉద్యోగుల స్టీరింగ్ కమిటీ సమావేశం.
- 29న సామాజిక పింఛన్ల నగదు బ్యాంకుల నుంచి విత్ డ్రా చేయడం.
- జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో అధికారిక వాట్సాప్ గ్రూపుల నుంచి వైదొలగడం.
- నల్ల బ్యాడ్జీలు ధరించి అక్టోబర్ ఒకటిన లబ్ధిదారుల ఇళ్ల వద్ద పింఛన్ల పంపిణీ.
- రెండున గాంధీ జయంతి సందర్భంగా మహాత్మా మా ఘోష విను అంటూ వాట్సాప్ స్టేటస్ నిక్షిప్తం.
- మూడు, నాలుగు తేదీల్లో మండల, మున్సిపల్ స్టీరింగ్ కమిటీల సన్నాహక సమావేశం.
- ఐదున రాజమహేంద్రవరం వేదికగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ప్రాంతీయ సభ.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను సత్వరం పరిష్కరించకుంటే నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని జిల్లా ఐక్య వేదిక ప్రకటించింది. ఉద్యోగుల నియమ నిబంధనలకు లోబడి పకడ్బందీ కార్యాచరణను రూపొందించి.. ప్రభుత్వం ద్వారా హక్కులను సాధించుకుంటామని స్పష్టం చేసింది. గ్రామ సచివాలయ ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామంటూ హెచ్చరించింది.

మండలం	గ్రామ సచివాలయాలు	ఉద్యోగులు
అయినవిల్లి	**19**	**158**
ఆలమూరు	24	195
అల్లవరం	23	166
అమలాపురం (అర్బన్)	15	137
అమలాపురం (రూరల్)	29	233
అంబాజీపేట	19	154
ఆత్రేయపురం	20	154
ఐ.పోలవరం	20	156
కె.గంగవరం	23	204
కపిలేశ్వరపురం	20	147
కాట్రేనికోన	22	140
కొత్తపేట	20	142
మల్కిపురం	23	159
మామిడికుదురు	22	162
మండపేట రూరల్	23	161
మండపేట (అర్బన్)	14	97
ముమ్మిడివరం (అర్బన్)	07	62
ముమ్మిడివరం రూరల్	14	114
పి.గన్నవరం	23	176
రామచంద్రపురం (అర్బన్)	12	109
రామచంద్రపురం రూరల్	21	189
రావులపాలెం	23	185
రాయవరం	19	149
రాజోలు	22	169
సఖినేటిపల్లి	21	127
ఉప్పలగుప్తం	17	137
మొత్తం	**515**	**3,982**

తీరు మార్చుకోకపోతే తీవ్ర చర్యలు

- విధులకు గైర్హాజరవుతున్న వైద్యులపై జేసీ ఆగ్రహం
- ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ



అమలాపురం ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల హాజరు పట్టీని పరిశీలిస్తున్న జేసీ నిషాంతి

అమలాపురం టౌన్: అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కొందరు వైద్యులు సంతకాలు చేసి గైర్హాజరవుతున్న తీరుపై జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో శానిటేషన్ నిర్వహణ బాగోలేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏరియా ఆస్పత్రిని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు హాజరు పట్టీని పరిశీలించి, ఆరా తీశారు. కొందరు వైద్యులు సంతకాలు చేసి విధులకు డుమ్మా కొడుతున్నట్టు గుర్తించారు. వైద్యులు తీరు మార్చుకోవాలని, ఈ పరిస్థితి పునరావృతమైతే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఆస్పత్రిలో అన్ని విభాగాలను ఆమె తనిఖీ చేశారు. ఆస్పత్రిలో పారిశుధ్యాన్ని పూర్తి స్థాయిలో మెరుగుపర్చాలని ఆదేశించారు. వైద్యుల లిఖితపూర్వక లీవ్ లెటర్లను కలెక్టరేట్ కార్యాలయానికి తేవాలని జేసీ ఆదేశించడంతో, కొందరు వైద్యులు ఆ ఆధారాలతో సోమవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. జేసీ వెంట అమలాపురం తహసీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ ఉన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, ఆర్ఎంవో నుంచి వైద్యుల లీవ్‌లు, లీవ్ లెటర్లు తదితర అంశాలపై జేసీ సమాచారం సేకరించారు.

కచ్చితమైన సేవలకు కొత్త మెషీన్లు

అమలాపురం రూరల్: కొత్త ఈపాస్ మెషీన్లు ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, కచ్చితమైన సేవలను అందించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయని జేసీ నిషాంతి తెలిపారు. సోమవారం కొత్త మెషీన్లను ఆమె డీలర్లకు పంపిణీ చేశారు. డిజిటల్ వెయింగ్ స్కేల్‌తో మానవీయ తప్పులను నివారించి రేషన్ పంపిణీని నిర్ధారిస్తాయన్నారు. కార్డుదారుల డేటాతో కేవలం అర్హత ఉన్నవారే రేషన్ పొందగలుగుతారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కె.మాధవి, డీఎస్‌ఓ అడపా ఉదయభాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల బంద్ విజయవంతం

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ఆందోళన



నిరసన ప్రదర్శన చేస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు, విద్యార్థులు

అమలాపురం టౌన్: ప్రభుత్వం డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ (ఆర్‌టీఎఫ్) నిధులను తక్షణమే విడుదల చేయాలన్న డిమాండ్‌తో రాష్ట్ర ప్రైవేటు డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలోని డిగ్రీ కళాశాలలు సోమవారం నిర్వహించిన బంద్ విజయవంతమైంది. జిల్లాలోని 49 ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఈ బంద్‌లో పాల్గొన్నాయి. ఆయా కళాశాలల యాజమాన్య ప్రతినిధులు విద్యార్థులతో కలసి పెండింగ్ ఫీజుల రీయింబర్స్‌మెంట్ నిధుల కోసం నినాదాలు చేశారు. తమ ప్రైవేటు డిగ్రీ కళాశాలలను స్వచ్ఛందంగా మూసివేసి బంద్ పాటించారు. జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంలోని ఏడు ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు, విద్యార్థులు తమ కళాశాలల వద్ద నిరసన ప్రదర్శనలు చేశారు. ప్రభుత్వం ప్రైవేటు డిగ్రీ కళాశాలలు, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల కోసం అమలాపురంలోని శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రైవేటు డిగ్రీ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కేవీఆర్ఎస్ నరసింహారావు ఆధ్వర్యంలో కళాశాల నుంచి నిరసన ర్యాలీ కూడా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.మనోహర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాతావరణ కాలుష్యాన్ని సృష్టించవద్దు

– పంచాయతీ సిబ్బందికి కలెక్టర్ హెచ్చరిక



పంచాయతీ సిబ్బంది సమావేశంలో మట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: పంచాయతీల్లో డంపింగ్ యార్డులు లేకున్నా.. బహిరంగంగా చెత్తను అంటించి వాతావరణ కాలుష్యాన్ని సృష్టించరాదని పంచాయతీ సిబ్బందిని కలెక్టర్ ఆర్ మహేష్‌కుమార్ హెచ్చరించారు. స్వామిత్వ సర్వే, లెగసీ వేస్ట్ మేనేజ్‌మెంట్, స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా పన్ను సేకరణ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పంచాయతీ సిబ్బందితో వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారీగా డంపింగ్ యార్డులు, చెత్త నిర్వహణ, 15వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపు, పంచాయతీల పన్నుల సేకరణ తదితర అంశాలపై సమగ్ర నివేదికను మూడు రోజుల్లో సమర్పించాలని డీపీఓను ఆదేశించారు. అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలకు సంబంధించి సమీప గ్రామాల నుంచి చెత్తను సేకరించి వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. కాలువ గట్లపై, హైవే వెంబడి చెత్తాచెదారాలను వేయకుండా సమగ్ర కార్యాచరణ రూపొందించాలన్నారు. డీపీఓ శాంతలక్ష్మి, డీఎల్‌డీవోలు వేణుగోపాల్, విజయలక్ష్మి, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

25న ఉద్యోగ నియామక పత్రాలు

మెగా డీఎస్సీ–2025 రిక్రూట్‌మెంట్‌లో ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 25న అమరావతిలో ముఖ్యమంత్రి ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేస్తారని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. కోనసీమ జిల్లాకు చెందిన అభ్యర్థులు 24వ తేదీ సాయంత్రం 4 గంటలకు రాజమహేంద్రవరంలో నిర్దేశిత వేదిక వద్ద రిపోర్ట్ చేయాలని సూచించారు.

పీజీఆర్ఎస్‌కు 205 అర్జీలు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి సారించాలని, సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదని కలెక్టర్ మహేష్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌కు 205 అర్జీలు అందాయి. జేసీ నిషాంతి, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. అలసత్వం లేదా ఇబ్బందులకు గురి చేయడం వంటి విషయాలను పరిశీలించి, సమస్యపై అర్జీదారుడు కలెక్టర్‌ను కలిసేలా పీజీఆర్ఎస్‌లో మార్పులు తెచ్చినట్టు జేసీ తెలిపారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను మానుకోవాలి

- ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలి
- సీపీఎం జిల్లా రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారావు

అమలాపురం టౌన్: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా రౌండ్ టేబుల్ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అలాగే అమలాపురం ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరింది. అమలాపురంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఈ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. పలు ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని కూటమి ప్రభుత్వ పీపీపీ విధానాన్ని ఖండించారు. సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు దడాల సుబ్బారావు మాట్లాడుతూ, ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్య, ప్రజారోగ్యం కొనసాగాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో నిర్వహించాలన్న నిర్ణయం పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకేనని అభిప్రాయపడ్డారు. విలువైన ప్రజాధనాన్ని ప్రైవేటు వారికి కారుచౌకగా కట్టబెట్టే పీపీపీ విధానంతో వైద్య రంగాన్ని ప్రైవేటీకరణ చేయాలనుకోవడం సరికాదని విమర్శించారు. పీపీపీ విధానానికి ఈ ప్రభుత్వం కొత్త భాష్యం చెబుతూ.. ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని పార్టీ జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు ఆరోపించారు. అమలాపురం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి సంబంధించి కామనగరువు, సమనస గ్రామాల సరిహద్దుల్లో కాలేజీ భవనాల నిర్మాణాలు దాదాపు 50 శాతం పూర్తయ్యాయని గుర్తు చేశారు. గత ప్రభుత్వం సదుద్దేశంతో రాష్ట్రంలో పలు మెడికల్ కాలేజీల నిర్మాణాలు 30 నుంచి 50 శాతం పూర్తి చేస్తే, కూటమి ప్రభుత్వం అవి చూపకుండా ఖాళీ స్థలాలను, పునాది దశల్లో ఉన్న పాత ఫొటోలను చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని దుయ్యబట్టారు. అమలాపురం ప్రభుత్వ మెడికల్ కాలేజీని కాపాడుకునేందుకు ఐక్య ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు ఎ.రవి, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీరావు, యూటీఎఫ్ నాయకులు బీఎస్ వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, దళిత స్త్రీ శక్తి రాష్ట్ర కన్వీనర్ కొంకి రాజామణి, పి.అమూల్య, నాగవరలక్ష్మి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజుకు వేళాయె

- అపరాధ రుసుం లేకుండా అక్టోబర్ 10 తుది గడువు
- ఆలస్యమయ్యే కొద్దీ పెరగనున్న అపరాధ రుసుం
- జిల్లాలో 27,618 మంది ఇంటర్ విద్యార్థులు



రాయవరం: వచ్చే విద్యా సంవత్సరంలో నిర్వహించనున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు సంబంధించి తొలి అడుగు పడింది. పరీక్ష ఫీజు చెల్లింపునకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. అపరాధ రుసుం లేకుండా ఇంటర్మీడియెట్ పరీక్ష ఫీజు చెల్లింపునకు అక్టోబర్ 10వ తేదీ తుది గడువుగా ఇంటర్మీడియెట్ బోర్డు నిర్ణయించింది. 2026 మార్చిలో జరగనున్న ఇంటర్ పరీక్షలకు ఇంటర్మీడియెట్ బోర్డు పరీక్ష ఫీజు ఈ నెల 15వ తేదీ నుంచి చెల్లించే విధంగా ఇంటర్మీడియేట్ బోర్డు కమిషనర్ ఆదేశాలు విడుదల చేశారు. అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఇంటర్ బోర్డు అక్టోబర్ 10వ తేదీ వరకు తొలుత గడువు విధించింది. అక్టోబర్ 11 నుంచి 21వ తేదీ వరకు రూ.1,000 అపరాధ రుసుముతో చెల్లించే అవకాశం ఉంది. అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజును చెల్లించేందుకు విద్యార్థులు అప్రమత్తమవ్వాలని ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు సూచిస్తున్నారు.

పరీక్ష ఫీజుల చెల్లింపు ఇలా..

ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ జనరల్/ఒకేషనల్ విద్యార్థులు థియరీ పరీక్ష నిమిత్తం రూ.600 చెల్లించాల్సి ఉంది. జనరల్ కోర్సులు చదివే సైన్స్ విద్యార్థులు ప్రాక్టికల్స్ (సెకండియర్ విద్యార్థులు మాత్రం) రూ.275 చెల్లించాల్సి ఉంది. ఒకేషనల్ కోర్సు చదువుతూ బ్రిడ్జి కోర్సు చేసే విద్యార్థులు బ్రిడ్జి కోర్సు సబ్జెక్టులకు పరీక్ష రుసుంగా రూ.165 చెల్లించాల్సి ఉంటుంది. సెకండియర్ చదువుతూ ఫస్టియర్ సబ్జెక్టులు ఫెయిలైన విద్యార్థులు మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం థియరీ ఫీజు కలిపి రూ.1,200 చెల్లించాలి. ఒకేషనల్ కోర్సు చదువుతూ ఫస్టియర్, సెకండియర్ ప్రాక్టికల్స్ రాసే విద్యార్థులు రెండేళ్లకు కలిపి రూ.550 చెల్లించాలి. బ్రిడ్జి కోర్సు చదివే విద్యార్థులు రెండేళ్ల పరీక్షలు కడితే రూ.330 చెల్లించాలి.

ఫస్టియర్, సెకండియర్ పాసై ఉండి, మార్కులు ఇంప్రూవ్‌మెంట్‌కు పరీక్ష రాసే ఆర్ట్స్ విద్యార్థులు రూ.1,350 వంతున, సైన్స్ విద్యార్థులు రూ.1,600 వంతున పరీక్ష ఫీజుగా చెల్లించాలి.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మొత్తం ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 130 జూనియర్ కళాశాలలున్నాయి. వీటిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 13, ఎయిడెడ్ ఒకటి, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఆరు, హైస్కూల్ ప్లస్ 19, ఒకేషనల్ కళాశాలలు 25, ప్రైవేట్ కళాశాలలు 66 ఉన్నాయి. ఈ కళాశాలల్లో ఇంటర్ ఫస్టియర్ 13,750 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. సెకండియర్ విద్యార్థులు 13,868 మంది చదువుతున్నారు. వచ్చే ఏడాది మార్చిలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు (ఐపీఈ) రాయాలంటే దరఖాస్తుతో పాటు పరీక్ష ఫీజును తప్పనిసరిగా చెల్లించాలి. జిల్లాలో 27,618 మంది విద్యార్థులు పరీక్ష ఫీజును చెల్లించాల్సి ఉంది.

గడువులోగా చెల్లించాలి



పరీక్ష ఫీజును గడువులోగా చెల్లించాలని ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు ఆదేశాలు ఇచ్చాం. పరీక్ష ఫీజు సకాలంలో చెల్లించే విధంగా విద్యార్థులను అప్రమత్తం చేయాలని సూచించాం. గడువు ముగిసిన తర్వాత అపరాధ రుసుంతో చెల్లించాల్సి వస్తుంది.

– వనుము సోమశేఖరరావు,
ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాశాఖాధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

నాందీ ఫౌండేషన్‌తో నన్నయ ఎంఓయూ



ఎంఓయూ పత్రాలను మార్చుకుంటున్న దృశ్యం

రాజానగరం: నాందీ ఫౌండేషన్‌తో ఆదికవి నన్నయ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. సోమవారం ఇందుకు సంబంధించిన పత్రాలపై వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ఫౌండేషన్ రీజనల్ మేనేజర్ శ్రీలక్ష్మి సంతకాలు చేసి, పరస్పరం మార్చుకున్నారు. ఏపీలో తొలిసారిగా «నన్నయ» వర్సిటీతో నాందీ ఫౌండేషన్ ఒప్పందం కుదుర్చుకుందని వీసీ తెలిపారు. దీని ద్వారా యూనివర్సిటీ క్యాంపస్‌తోపాటు కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లు, అనుబంధ కళాశాలల్లోని 22 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. నైపుణ్యాభివృద్ధితోపాటు ఉద్యోగావకాశాలకు అవసరమైన శిక్షణను ఉచితంగా పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ బి.జగన్‌మోహన్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓఎన్‌జీసీ పైప్‌లైన్ లీక్



కె.పెదపూడి వంతెన వద్ద లీక్ అవుతున్న గ్యాస్, ఆయిల్

అంబాజీపేట: కె.పెదపూడి–కొత్తపాలెం వంతెన వద్ద ఉన్న అప్పర కౌశిక గట్టుపై సోమవారం ఓఎన్‌జీసీకి చెందిన గ్యాస్ పైప్ లైన్ లీక్ అయింది. వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లిన రైతులలో కొంతమంది గ్యాస్, ఆయిల్ లీకేజీ అయిన ప్రాంతంలో ఆయిల్ వాసన రావడంతో ఆయిల్, గ్యాస్ మిళితమైన వాసన వస్తున్నట్టు గమనించారు. తక్షణమే వారు అంబాజీపేట పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దాంతో పోలీసులు ఓఎన్‌జీసీ అధికారులకు లీకేజీ విషయాన్ని తెలియజేశారు. అయినవిల్లి మండలం మడుపల్లి నుంచి మామిడికుదురు మండలం పాశర్లపూడి వెళుతున్న పైపు లైన్ లీకేజీ ప్రాంతాన్ని ఓఎన్‌జీసీ అధికారులు హుటాహుటిన సిబ్బంది సాయంతో చేరుకుని పరిశీలించారు. ఉదయం నుంచి శ్రమించి సాయంత్రానికి గ్యాస్, ఆయిల్ పైప్ లీకేజీని అరికట్టడంతో గ్రామస్తులు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

ఖైదీ పరారీ



బత్తుల ప్రభాకర్ (ఫైల్)

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి వాయిదా కోసం విజయవాడ తీసుకువెళ్లి తిరిగి తీసుకువస్తుండగా బత్తుల ప్రభాకర్ అనే ఖైదీ సోమవారం రాత్రి 7.30గంటలకు దేవరపల్లి మండల దుద్దుకూరు వద్ద పోలీసుల నుంచి తప్పించుకుని పరారయ్యాడు. దొంగతనం కేసులో నిందితుడు అయిన ఇతను పారిపోయినప్పుడు ఒక చేతికి హ్యాండ్ కప్స్, వైట్ కలర్ టీ షర్ట్, బ్లాక్ కలర్ ట్రాక్ ప్యాంటు ధరించి ఉన్నాడని దేవరపల్లి ఇన్‌స్పెక్టర్ తెలిపారు.పై ముద్దాయి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 94407 96584 (ఇన్‌స్పెక్టర్ దేవరపల్లి), 94407 96624 (సబ్ ఇన్‌స్పెక్టర్ దేవరపల్లి) ఫోన్ నంబర్లకు తెలియజేయాలని కోరారు. ముద్దాయి ఆచూకీ లేదా సమాచారం తెలిపిన వారికి తగిన పారితోషికం ఇస్తామని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



వీరబాబు (ఫైల్)

గోపాలపురం: మండలంలోని కరిచర్లగూడెం గ్రామానికి చెందిన శింగులూరి వీరబాబు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందినట్లు ఎస్సై పి మనోహర్ సోమవారం విలేకరులకు తెలిపారు. కరిచర్లగూడెంలో టిప్‌టాప్ కంపెనీలో లైటింగ్ ఇతర పనులు చేస్తున్న శింగులూరి వీరబాబు మండలంలోని కోమటికుంట గ్రామంలో పుట్టిన రోజు వేడుకల్లో లైటింగ్ పనులకు వెళ్లాడు. అప్పటికే భారీ వర్షం కురవడంతో కాలి కింద వైర్లు తడిసిపోవడం వల్ల షాక్‌కు గురై వీరబాబు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతనిని తోటి కార్మికులు గోపాలపురం సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వీరబాబు మృతితో కరిచర్లగూడెం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. అతని తండ్రి చనిపోయి నాలుగు సంవత్సరాలు అవుతుంది. తల్లి, తమ్ముడు ఉన్నారు. ఇంటికి పెద్దదిక్కును కోల్పోయామని తల్లి, తమ్ముడు రోదిస్తున్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న లాయర్లు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): న్యాయవాదుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐ.ఎల్.ఏ) ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. కాకినాడ బార్ అసోసియేషన్ నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ కలెక్టరేట్‌కు వరకూ సాగింది. అనంతరం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు అసోసియేషన్ నాయకులు డిమాండ్లతో కూడిన వినతి పత్రంను సమర్పించారు. ఈ సందర్భంగా కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ డెత్ బెన్ఫిట్ ఫండ్ కుటుంబాలకు రూ.10 లక్షలు ఇవ్వాలని, న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐ.ఎల్.ఏ) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టి.పృధ్వీరాజ్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం, స్టేట్‌బార్ కౌన్సిల్ విఫలమయ్యాయని ఆరోపించారు. అర్హులైన న్యాయవాదులకు రూ.10 లక్షలు ఆరోగ్య బీమా కార్డులు మంజూరు చేయాలని, జూనియర్ న్యాయవాదులకు రూ.10వేలు చొప్పున ఐదేళ్ల పాటు స్టయిఫండ్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఐ.ఎల్.ఏ. జిల్లా ఉపాధ్యక్షుడు కోలా శ్రీహరి రావు మాట్లాడుతూ ప్రభుత్వం నోటరీ న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని, మ్యాచింగ్ గ్రాంటును విడుదల చేయాలన్నారు. ఐఎల్ఏ జిల్లా మహిళా కన్వీనర్ డాక్టర్ వై.వసంతకుమారి మాట్లాడుతూ న్యాయశాఖ ఉద్యోగాలలో మహిళలకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని కోరారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెక్కపల్లి వీరభద్రరావు, ఐ.ఎల్.ఏ. జిల్లా నాయకులు పిల్లి శ్రీనివాస్ గౌడ్, మంగం శివరామకృష్ణ, జె.వి.రమణ, ఎం.సరోజిని, బండి నరేంద్ర, నాగభూషణం, పంతగడ అప్పారావు, బి.వి.రమణ, చక్రవర్తి,అశోక్, అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల అమలుకు కృషి

ఈటీసీ ప్రిన్సిపాల్ ప్రసాదరావు సూచన



11 జిల్లాలలోని టీఓటీలకు శిక్షణను ప్రారంభించిన ప్రిన్సిపాల్ ప్రసాదరావు

సామర్లకోట: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల అమలుకు కృషి చేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ కేఎస్‌వీ ప్రసాదరావు అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం(ఈటీసీ)లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమ, ఏలూరు జిల్లాల్లో టీఓటీలుగా ఎంపిక చేసిన సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణను సోమవారం ఆయన ప్రారంభించారు. టీఓటీలకు మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న టీఓటీలు ఆయా మండలాలకు వెళ్లి పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణ ఇవ్వవలసి ఉంటుందన్నారు. 11 జిల్లాలో 300 మందికి శిక్షణ ఇవ్వవలసి ఉండగా ఆరవ బ్యాచ్‌తో శిక్షణ పూర్తి అవుతుందని చెప్పారు. ఆయన మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో పేదరికం లేని గ్రామాలు, ఆకలి నిర్మూలన, మంచి ఆరోగ్యం, నాణ్యమైన విద్య, లింగ సమానత్వం, పరిశుభ్రమైన నీరు, పారిశుధ్యం, ఆర్థికాభివృద్ధి వంటి అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ప్రతీ గ్రామంలో అమలు జరిగే విధంగా చూడాలన్నారు. గ్రామాలల్లో ప్రజలందరిని ఆరోగ్యంగా ఉంచటం ద్వారా మంచి గ్రామాన్ని తయారు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ మేరకు ప్రజల్లో పోషకాహార లోపాలను గుర్తించడం, కౌమార దశలో ఉన్న బాలికలు, స్త్రీలలో రక్తహీనతను తొలగించడం, తక్కువ బరువు కలిగిన పిల్లలను గుర్తించవలసి ఉంటుందన్నారు. ఈ మేరకు ఈ పనులను స్త్రీ, శిశు సంక్షేమ శాఖ చేయవలసి ఉంటుందని చెప్పారు. స్థానికంగా సేకరించిన తృణధాన్యాలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. అంటువ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. మాతాశిశు మరణాలు లేకుండా చేయాలని సూచించారు. ఈ మేరకు హెల్త్ సిబ్బంది ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లో నాణ్యమైన, పోషకమైన మధ్యాహ్న భోజనం అందించే విధంగా చూడాలని తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్, జాతీయ ఆయుష్ మిషన్, ఐసీడీఎస్ అనుబంధ పథకాలు, ప్రధానమంత్రి మాతృ వందన యోజన, పోషణ్ అభియాన్‌లు పంచాయతీ స్థాయిలో వినియోగించుకోవాలని చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ ఫ్యాకల్టీలు డి.శ్రీనివాసరావు, కె.సుశీల, ఎస్ఎస్ శర్మ, ఎం. చక్రపాణిరావు, కేఆర్ నిహారిక, పి.రామకృష్ణ, వి.జగన్నాథం, ఎం.రాజ్‌కుమార్ శిక్షణ నిర్వహించారు.

25న డీఎస్సీ సెలక్టెడ్ టీచర్లకు సమావేశం

రాయవరం: డీఎస్సీ–2025 సెలక్టెడ్ ఉపాధ్యాయులకు ఈ నెల 25న అమరావతిలో సమావేశం ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా సోమవారం తెలిపారు. సెలక్టెడ్ ఉపాధ్యాయులు ఈ నెల 24న రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కళాశాలలో తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖాధికారికి రిపోర్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. అక్కడ నుంచి ఈ నెల 25 ఉదయం విజయవాడకు బస్సుల్లో వెళ్తారని, మార్గమధ్యంలో భీమడోలులో లంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. డీఎస్సీ సెలక్టెడ్ అభ్యర్థులందరూ ఈ విషయాన్ని గమనించి, ప్రతి ఒక్కరూ సమావేశానికి హాజరు కావాలని డీఈవో బాషా తెలిపారు.

ముగిసిన సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపికలు



కాకినాడ జిల్లా సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

తాళ్లరేవు: కాకినాడ జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా సీనియర్ పురుష, మహిళల జట్ల ఎంపిక ప్రక్రియ ముగిసింది. చొల్లంగి జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో జరిగిన ఎంపికలకు కాకినాడ జిల్లా నుంచి 40 మంది పురుషులు, 30 మంది మహిళలు పాల్గొన్నారు. కాకినాడ జిల్లా అధ్యక్షుడు సాయిబాబా, కార్యనిర్వాహక కార్యదర్శి వి.నీలిమ, సీనియర్ వ్యాయామోపాధ్యాయులు ధనలక్ష్మీ కుమారిల సమక్షంలో జరిగిన ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన 8 మంది పురుషులు, 8 మంది మహిళలను కాకినాడ జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. పురుషుల జట్టులో లివేష్, వినయ్, కేఎస్ నారాయణ, రాజేంద్రప్రసాద్, సాత్విక్, బద్రీష్, తేజ, సన్నీ, మహిళల జట్టుకు మానవి, మానస, తేజస్వి, శాన్వి, దివ్యజ్యోతి, బ్లెస్సీ, పద్మ, బిఎస్ఎస్ లక్ష్మిఐశ్వర్య ఎంపికైనట్లు నీలిమ తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జట్ల ఎంపిక



జి.మామిడాడలో క్రీడా ఎంపికల్లో బాస్కెట్‌బాల్ ఆడుతున్న బాలికలు



జి.మామిడాడలో క్రీడా ఎంపికల్లో వాలీబాల్ ఆడుతున్న బాలురు

పెదపూడి: రాష్ట్ర స్థాయిలో జరిగే అండర్–19 బాస్కెట్‌బాల్, బాలీబాల్, బాడ్మింటన్ పోటీలకు బాలురు, బాలికల విభాగాల్లో జట్లు ఎంపిక చేశామని ఆర్గనైజింగ్ సెక్రటరీ పడాల గంగాధర్‌రెడ్డి అన్నారు. జి.మామిడాడ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఎస్‌జీఎఫ్ అండర్–19 ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడా ఎంపికలు పాఠశాల హెచ్ఎం అప్పలచారి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమాన్ని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జుత్తుగ సూర్యకుమారి, కాకినాడ డివిజనల్ ఆత్మ కమిటీ చైర్మన్ రావాడ నాగు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఎంపికల్లో సుమారు 400 బాలురు, బాలికలు పాల్గొన్నారు. కార్యక్రమంలో పూర్వ క్రీడాకారుల సంఘం అధ్యక్షుడు సబ్బెళ్ల శివన్నారాయణరెడ్డి, ఇల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం పప్పు శ్రీనివాసరెడ్డి, రామచంద్రపురం ఎంఈఓ తాడి వీర రాఘవరెడ్డి, రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘం మాజీ అధ్యక్షుడు లంక జార్జ్ స్కూల్ గేమ్స్ సెక్రెటరీ సుధ, పూర్వ క్రీడాకారులు మల్లిడి శ్రీనివాసరెడ్డి, రామలక్ష్మణులు పాఠశాల పీడీ నల్లమిల్లి అప్పారెడ్డి, దీప్తి ఎస్తేర్, యువరాజారెడ్డి, బులిగంగిరెడ్డి, గౌరీ శంకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

రూ. 5.13 లక్షలకు సోషల్ మీడియా మిత్రుడి టోపీ

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు గ్రామంలోని ఇద్దరు స్నేహితులను సోషల్ మీడియా ద్వారా పరిచయం అయిన మిత్రుడు రూ.5,13,999 టోపీ పెట్టినట్టు ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ సోమవారం తెలిపారు. పందలపాక గ్రామానికి చెంది ప్రస్తుతం బిక్కవోలు నివాసం ఉంటున్న నూలు దుర్గాప్రసాద్, బొమ్మకంటి శేఖర్ కుమార్‌లు స్నేహితులు. వీరికి 2022లో సోషల్ మీడియాలో బత్తులు సాయి రమేష్ అనే వ్యక్తి మార్కెట్ మినిస్టర్ పబ్లిక్ గ్రూప్ ద్వారా పరిచయం అయ్యాడు. అతను ఆ గ్రూప్ అడ్మిన్‌గా ఉన్నాడు. తాను కంటి డాక్టర్‌ను అని పరిచయం చేసుకున్నాడు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ట్రేడింగ్ చేయమని ప్రోత్సహిస్తూ, టిప్స్ ఇస్తూ వారిని నమ్మించాడు. అనంతరం ట్రేడింగ్ కోసం కాపిటల్ పెట్టమని ఒత్తిడి చేసి, తన ఫోన్ నంబర్ 9966614860 కు 13-1-2024 నుంచి 15-05-2024 వరకు మధ్య దశల వారీగా రూ.5,13.999 వేయించుకున్నాడు . లాభాలు ఇస్తానని నమ్మించాడు. తరువాత అతనికి ఫోన్ చేసినప్పుడు స్పందించకపోవడంతో తాము మోసపోయామని గ్రహించారు. దీంతో ఈ నెల 8 తేదీన జిల్లా ఎస్పీకి పీజీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో ఈ రోజు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ తెలిపారు.

సాయమందించి ప్రాణభిక్ష పెట్టండి

- ఏమి తిన్నా, తాగినా రక్తంతో కూడిన వాంతులు
- ఆదుకోవాలంటూ దాతలకు వినతి



రిపోర్ట్స్ చూపుతున్న దుర్గారావు

గండేపల్లి: ఆర్థిక సాయమందించి తనకు ప్రాణభిక్ష పెట్టాలని అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడు దాతలను వేడుకుంటున్నాడు. గండేపల్లి మండలం ఉప్పలపాడుకు చెందిన గరగ నాగ ఆంజనేయ దుర్గారావు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి తల్లి అమ్మాజీ, భార్య గౌరీ పార్వతి, కొడుకు సూర్యగణేష్ ఉన్నారు. ఇతను రెండేళ్ల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. ఏమి తిన్నా, తాగినా వాంతులు కావడంతో కాకినాడ జీజీహెచ్, విశాఖ కేజీహెచ్‌లోను వైద్య పరీక్షలు చేయించగా కడుపులో పుండ్లు ఉన్నాయని ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. అయితే కొన్ని వైద్య పరీక్షలు ప్రైవేటుగా చేయించుకోవాల్సి వచ్చిందని అందుకు తగిన సొమ్ము లేకపోవడంతో చేయించుకోలేదన్నాడు. పుట్టపర్తిలో ఉచితంగా వైద్యం చేస్తారని తెలియడంతో అప్పట్లో కొందరు దాతల సహాయంతో రెండు సార్లు పుట్టపర్తి వెళ్లగా అక్కడి వైద్యాధికారి అందుబాటులో లేకపోవడంతో తిరిగివచ్చేశానని, కాలక్రమేణ వ్యాధి ముదరడంతో మరింత నీరసించిపోతున్నానని దుర్గారావు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఘన పదార్థం కడుపులోకి వెళ్లకపోవడంతో కనీసం ద్రవ పదార్థాలు తాగేందుకు వైద్యుల సూచనల మేరకు ఇంజెక్షన్ చేయించుకుంటున్నానని, అది మూడు రోజుల వరకు పనిచేస్తుందని దానివల్ల తాగిన ద్రవ పదార్థాలు వాంతి కాకుండా చేస్తుందన్నాడు. ఆ ఇంజెక్షన్ విలువ రూ.400 అని దానికి దాతలే సాయమందిస్తున్నట్టు తెలిపాడు. లివర్ స్కానింగ్, ఎంఆర్ఐ స్కానింగ్, గొట్టం పరీక్షలతోపాటు బ్లడ్ అవసరం ఉందని వైద్యులు చెప్పినట్టుగా పేర్కొన్నాడు. తన తల్లికి వస్తున్న పింఛన్ నుంచి సాయం చేస్తోందని తెలిపాడు. ఈ వ్యాధికి ఆరోగ్యశ్రీకి వర్తించదని వైద్యులు చెప్పడంతో దాతల సాయం చేయాలని వేడుకుంటున్నాడు. సాయం అందజేసే దాతలు తన బ్యాంక్ అక్కౌంట్ (జెడ్ రాగంపేట యూనియన్ బ్యాంక్) 066910100082940 కు జమ చేయాలని వేడుకుంటున్నాడు.

గంధం చెట్ల దొంగలు దొరికారు



గంధం దొంగలతో పోలీసులు

రాజానగరం: మండలంలోని నందరాడలో గంధం చెట్లను దొంగిలించినవారిని స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన స్థానిక సీఐ వీరయ్యగౌడ్ సోమవారం ఇక్కడ మీడియాకు తెలిపిన వివరాలిలావున్నాయి. నందరాడలో ఒక రైతుకు చెందిన 12 ఎకరాల తోటలో కొబ్బరి, మామిడి, టేకు, ఎర్రచందనంతోపాటు గంధం చెట్లు కూడా ఉన్నాయి. వీటిలో రెండు గంధం చెట్లను ఈ నెల 16న గుర్తు తెలియని వ్యక్తులు మొదళ్ల వరకు నరికి తీసుకుపోయారు. ఈ మేరకు ఆ తోట కాపలాదారు దొడ్డా సోమేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన రాజానగరం పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని కట్ని జిల్లా సుగవాన్‌కు చెందిన జులిస్ ఆదివాసీ, శివరాజ్ ఆదివాసీ, ఉల్లిస్‌లను నిందితులుగా గుర్తించి, దివాన్ చెరువు జీరో పాయింట్ వద్ద అరెస్టు చేశారు. వారి నుంచి 53 గంధం ముక్కలను, చెట్టు నరకడానికి ఉపయోగించిన పరికరాలను స్వాధీన పర్చుకున్నారు. దొంగిలించిన రెండు గంధం చెట్ల విలువ రూ.3.50 లక్షలకు పైనే ఉంటుందన్నారు. గతంలో కోరుకొండ మండలం దోసకాయలపల్లిలో జరిగిన గంధం చెట్ల చోరీ కేసులో శివరాజ్ ఆదివాసీ నిందితునిగా ఉన్నాడు. ఇది ఒక ముఠా అని, ఇందులో ఉన్న సభ్యులంతా ఒక కుటుంబం మాదిరిగా గ్రామ శివార్లలో గుడారాలు వేసుకుని, రుద్రాక్షలు, కాశీ తాళ్లు, గవ్వలు అమ్ముతూ సంచరిస్తుంటారన్నారు. ఆయా ప్రాంతాలలో ఉండే గంధం చెట్లను టార్గెట్‌గా చేసుకుని వీరి సంచార జీవితం నడుస్తుందన్నారు. వీరిని గైడ్ చేసేది మాత్రం కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్‌కి చెందిన రాజా అని పేర్కొన్నారు. ఇతనిపై కూడా ఏలూరు పోలీసు స్టేషనులో కేసులున్నాయని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై ఎస్.ప్రియకుమార్, హెడ్ కానిస్టేబుల్ పి.అమ్మిరాజు, కానిస్టేబుళ్ల సత్యనారాయణ, కరీమ్, వెంకటరమణ, నాగేశ్వరరావు, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం స్వాధీనం



వీరరాఘవేంద్ర (ఫైల్)

పెదపూడి: పెదపూడికి చెందిన ఒక యువకుడి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్సై ఎస్.తులసిరామ్ సోమవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదపూడి గ్రామానికి చెందిన కె.వీరరాఘవేంద్ర(22), జి.మామిడాడ గ్రామానికి చెందిన యు.అనుకుమార్, స్టాలిన్, అభిలాష్, విజయకుమార్ స్నేహితులు. వీరరాఘవేంద్ర వరి కోత యంత్రంపై ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. వీరిలో అనుకుమార్ కొంతకాలం క్రితం ఒక ప్రమాదంలో మృతి చెందాడు. మృతి అనంతరం అనుకుమార్ భార్యతో వీరరాఘవేంద్ర వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్నాడు. అనుకుమార్ సోదరులైన స్టాలిన్, అభిలాష్ వీరరాఘవేంద్ర వ్యవహారంపై కోపం పెంచుకున్నారు. దీంతో ఈ నెల 21వ తేదీ సాయంత్రం జి.మామిడాడ మెయిన్ రోడ్డు సెంటర్లో వీరరాఘవేంద్ర ఉండటాన్ని వారు గమనించి గాజు సీసాలతో దాడికి పాల్పడ్డారు. అనంతరం గాయాలపాలైన అతన్ని మోటార్ బైక్‌పై ఎక్కించుకుని తీసుకునిపోయారు. ఈ ఘటనపై వీరరాఘవేంద్ర తల్లి వరలక్ష్మి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే దర్యాప్తులో భాగంగా దాడికి గురై గాయాలపాలైన వీరరాఘవేంద్ర మృతదేహం సోమవారం సాయంత్రం అన్నవరం గ్రామంలో లభ్యమైందన్నారు. వెంటనే పోలీసులు మృతదేహాన్ని కాకినాడ జీజీహెచ్‌కు పోస్టుమార్టం కోసం తరలించారు. దీనిపై ఎస్సై తులసిరామ్ మను వివరణ కోరగా వీరరాఘవేంద్ర ఏవిధంగా చనిపోయాడో లేక హత్యకు గురయ్యాడో అనే దానిపై దర్యాప్తు చేస్తున్నామని, వివరాలు తెలియజేస్తామని చెప్పారు.

యువకుడి అదృశ్యం



హరీష్

అమలాపురం రూరల్: మండలంలో వన్నె చింతలపూడి అంబేడ్కర్ నగర్‌కి చెందిన 28 సంవత్సరాలు పరమట హరీష్ 12 రోజుల నుంచి కనపడడం లేదు. కుటుంబ సభ్యులు హరీష్ కోసం అన్ని ప్రాంతాలలో వెతికినా ప్రయోజనం లేకపోయింది. సెంట్రింగ్ పనులు చేసే హరీష్ ఇంటినుండి వెళ్లిపోయినప్పుడు సిమెంట్ కలర్ షర్ట్, లైట్ బ్లూ ఫాంట్ ధరించాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఫోన్ ఇంటి వద్ద ఉంచి అదృశ్యమైనట్లు వారు తెలిపారు. అమలాపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై శేఖర్‌బాబు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నిడదవోలు : పట్టణంలో ఎన్టీఆర్ కాలనీలో సుమారు 40 ఏళ్లు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. తుప్పల్లో ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా పట్టణ ఎస్సై జగన్‌మోహన్‌రావు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.